
'ఆటా' కథల పోటీల్లో ఎంపికైన కథ

-పి.వి.బి. శ్రీరామమూర్తి

# అతని ఊపిరి!



"చెప్పేవాడికి లేకపోతే వినేవాడికైనా వివేకం ఉండాలి!"

"అయినా మరీ అంత మొండితనం పనికిరాదు."

"అహ... అక్కడికి అతడే మగాడూ... తక్కినోళ్ళంతా చేతులకి గాజులు తొడిగించుకునేటోళ్ళు!"

"ఊరందరిదీ ఓ దారయితే ఉలిపికట్టెదో దారట."

-ఇలాటి మాటలు విని విని విసుగెత్తిపోయింది పరమేశ్వరి.

అలా అంటున్న వాళ్ళెవరికీ ఆమె ఏనాడూ జవాబివ్వలేదు. "నీ భర్తని నువ్వే దార్లో పెట్టుకోవాలి." ఎందరో సలహాలిచ్చారు. ఆమె అన్నీ వింటుంది. తలూపుతుంది. అంతే!

అతని పోరాటం కొనసాగుతునే ఉంటుంది!... ఉంది! - ఇప్పటికీను!

ఆమె ఎప్పట్లాగే మువునంగా ఉండిపోయింది.

ప్రపంచానికి అతనో ప్రశ్నార్థకం!

కానీ -అతన్ని పూర్తిగా అర్థం చేసుకోగలిగింది ఆమె ఒక్కర్తే!

అలా అని ఆమె అనుకోవటం కాదు. అతనే అన్నాడు ఎన్నిసార్లో!

అతని పోరాటానికి ఆమె తన సంపూర్ణ సహకారాన్ని అందిస్తుంది అందుకే-

అందరూ అనుకున్నట్టు ఆమె ఏనాడూ అతన్నించి మానసికంగా ఎలాటి అశాంతికీ గురికాలేదు. ఎప్పుడూ బాధపళ్ళేదు. ఏనాడూ కలత చెందలేదు. ఎక్కడా ఆవేదనకి గురికాలేదు.

తొలిసారి అతనితో జీవితాన్ని పంచుకున్న సంఘటన ఆమె ఎన్నటికీ మరిచిపోలేదు.

ఆరోజు-

పరంధామయ్యగారింటికి తల్లిదండ్రులు రమ్మంటే పెళ్ళికెళ్ళింది. పెళ్ళిపందిరి హడావుడిగా ఉంది. పురోహితులు ఆపమన్న పావుగంటవరకూ బేండు మేళం వాళ్ళు భజంత్రీలు ఆపకుండా సినిమా పాటలు వాయించేస్తున్నారు. వచ్చిన వాళ్ళంతా ఒకళ్ళనొకళ్ళు పలకరింపులు. ఫొటోలలో తమ ముఖాలు కనిపించాలని పడిగాపులు. ఎవరి సందడిలో వాళ్ళున్నారు. ఇంతలో పెళ్ళిపందిట్లో కేకలు... గోల... పెళ్ళికొడుకు మృత్యుంజయుడు తాండవ నృత్యం చేస్తున్నాడు. పెళ్ళికొడుకు మామగారు- అనేకంటే- పెళ్ళికూతురి తండ్రి- మృత్యుంజయరావు రెండు చేతులూ పట్టుకుంటున్నాడు.

'కథ మామూలే! కట్నం ఇవ్వాల్సింది బకాయి పెట్టుంటాడు' అనుకుంటున్నారందరూ. పెళ్ళికొడుకు తండ్రి దోషిలా నిలబడ్డం ఎవరికీ అర్థం కాలేదు.

"ఇది మోసం... ఇది దగా. నేనిక్కడ క్షణం ఉండను" మృత్యుంజయరావు పీటలమీద నుంచి దిగి వెళ్ళిపోతున్నాడు. అతని తండ్రి అతన్ని వారిస్తున్నాడు. సంగతి తెలిసిన పరమేశ్వరికి ఆశ్చర్యం వేసింది.

ఆమేకాదు. పెళ్ళిపందిట్లో అందరూ ఆశ్చర్యంనుంచీ తేరుకోవటం లేదు. విషయం ఏమంటే- "కట్నం తీసుకోవటం చట్టరీత్యా నేరం. అందుకే తన పెళ్ళికి కట్నం ప్రసక్తి లేదు' అని తండ్రితో అంటే- "నిజమేరా! నేనూ మీ అక్కకి కట్నం ఇచ్చే పెళ్ళిచేసాను. మీ చెల్లికింకా పెళ్ళి చెయ్యాలి. నువ్విలా కట్నం పుచ్చుకోనని భీష్మించుకుంటే నేను దాని పెళ్ళెలా చేసేది. ఆలోచించు!" అని తండ్రి అంటే-

"మనకి తగ్గ స్థాయిలో మనకు నచ్చిన సంబంధం చూసుకుందాం. అయినా నేను కట్నం పుచ్చుకోనంటున్నాను గానీ- ఇవ్వననలేదు కదా! చెల్లి పెళ్ళిచేసే పూచీ నాదని కూడా చెప్పాను. లేదూ అంటే దాని పెళ్ళయేంతవరకూ నేనాగుతానని చెప్పాను కదా. అర్థం చేసుకోరే!"

తండ్రి వినక సంబంధం తెచ్చారు. 'అమ్మాయి బాగుంది. డిగ్రీ పూర్తిచేసింది' అని నచ్చచెపితే ఒప్పుకున్నాడు. కానీ పెళ్ళికూతురి తండ్రితో పరంధామయ్యగారు తన కష్టాన్ని వెళ్ళగక్కుకున్నారు. పరంధామయ్య ఆవేదనలో అర్థం ఉందనిపించింది. ఏ తండ్రీ తన కూతుళ్ళకి కట్నాలు పోసి, - కొడుకుల విషయంలో వరకట్న వ్యతిరేకతను ప్రదర్శించలేదు. అందులోనూ పరంధామయ్య బొత్తిగా మధ్యతరగతి మానవుడు. అందుకే పెళ్ళికుమార్తె తండ్రి- అల్లుని వ్యక్తిత్వానికి మురిసిపోతూ, పరంధామయ్య మెత్తని మనసుకి కరిగిపోతూ- తానివ్వదలుచుకున్నది తప్పక ఇస్తానన్నాడు. అలాగే ఇచ్చాడు. తానాశించిన దానికంటే అధికంగా లభించటంతో ఆనందపడుతూ 'ఈ విషయం మాత్రం కొడుక్కి తెలీనివ్వవద్ద'న్నాడు.

పెళ్ళికూతురు తండ్రీ 'సరే'నన్నాడు.

మరి- విషం ఎలా పాక్కిందో బయటకు పొక్కేసింది.

ఎంతవరకూ వెళ్ళకూడదో అంతవరకూ వెళ్ళింది. ఎవరికి చేరకూడదో వారికి చేరిపోయింది. మృత్యుంజయుడు తండ్రిని నిలదీసాడు. తండ్రి 'నువ్వు విన్నది అబద్ధం' అన్నాడు. పెళ్ళికుమార్తె తండ్రి 'నేను పైసా ఇవ్వలేదు. ఇచ్చీ దాపరికం నాకేల?'అన్నాడు.

"సరే మీ మాట నమ్ముతాను. మీ విషయం మీ అమ్మాయి మీద ప్రమాణం చేసి చెప్పగలరా?" అన్నాడు మృత్యుంజయ.

"తప్పకుండా చేస్తాను. నాకు భయమేంటి?" అని ప్రమాణం చెయ్యబోతున్నంతలో-

పెళ్ళికూతురు "నాన్నగారూ! మీరెందుకబద్ధం ఆడాలి? ఇచ్చినట్లు నిజమే చెప్పండి" అని ఆమె ఒంటికాలి మీద భద్రకాళిలా లేచింది. ఆ తరువాత నిజం బయట పడింది. పరంధామయ్య తప్పు తనదేనని ఒప్పుకుని. కట్నం మొత్తం ఇచ్చేస్తానన్నాడు. పీటల మీద పెళ్ళి ఆగిపోతే ఆడపిల్ల తండ్రికి ఎంత మానసిక క్షోభో ఊహించి ఒప్పుకున్నాడు.

కానీ-

కథ అక్కడే అనుకోని మలుపు తిరిగింది.

"నాన్నగారూ! నన్ను క్షమించండి. ఇంత కఠినమైన నిర్ణయాలు తీసుకునే వ్యక్తితో నేను జీవితంలో సుఖపళ్ళేను. నేనీ పెళ్ళిచేసుకోను. నాకీ పెళ్ళి ఇష్టంలేదు" అని పీటలమీద నుంచి లేచిపోయింది.

ఇది మరింత ఆశ్చర్యపరిచింది అందరినీ!

పెళ్ళికూతురి శీలాన్ని శంకించారు కొందరు. 'ఈ పిల్లకీ పెళ్ళిముందరే ఇష్టం లేదేమో!' ఇంత రహస్యంగా ఉన్న వరకట్న ఒప్పందాన్ని ఈమే 'లీక్' చేసిందేమోనన్న అనుమానం వచ్చింది మరికొంతమందికి.

అందరూ ఆమెకు నచ్చచెప్పారు.

పరంధామయ్య ఆ పిల్ల చేతులు పట్టుకుని బతిమాలాడు.

ఎవరెన్ని చెప్పినా ఆమె వినలేదు. విసవిసా వెళ్ళిపోయింది. పెళ్ళిపందిరి గందరగోళంగా తయారయింది. పంతులుగారోపక్క ముహూర్తం దగ్గర పడిందని గాబరా పడుతున్నారు. సరిగ్గా- ఆ సమయంలోనే- మృత్యుంజయరావు గురించి తీక్షణంగా ఆలోచించిన పరమేశ్వరి అతని వ్యక్తిత్వాన్ని ఆకర్షించింది. తల్లీతండ్రీ వద్దన్నా వినకుండా మృత్యుంజయరావుని చేపట్టింది. అర్ధాంగి అయింది. అతని కష్టాల్లో పాలుపంచుకుంది. అతని ఆదర్శాలను అర్థంచేసుకుంది. అతనికి వెన్నుదన్నుయి నిలిచింది. కుటుంబ బరువు బాధ్యతలు బాధపడుతూ గాక, ఆనందంతో స్వీకరించింది. పొదుపుగా కాపురంచేసి ఆడపడచు పెళ్ళిచేసింది. ఉన్నంతలో దాచి పిల్లలను తీర్చిదిద్దింది.

తల్లీతండ్రీ ఈ పెళ్ళిని వ్యతిరేకించటానికి కారణం ఉంది. వాళ్ళు తమ కడగొట్టి కూతురికి వాళ్ళ హోదాకి తగ్గ సమ్మంధం చేయాలనుకున్నారు. తమకంటే చాలా తక్కువ స్థితిలో ఉన్న వ్యక్తితో వియ్యమందటం వాళ్ళకి నచ్చలేదు.

మిగిలిన అల్లుళ్ళంతా పెద్ద పొజిషన్‌లో ఉన్నారు. అందుచేతనే తండ్రి పండుగలకూ, పబ్బాలకూ పిల్చినా ఎప్పుడో కాని వెళ్ళేది కాదు. అదీ ఒక్కతే వెళ్ళివచ్చేసేది. 'అల్లుడు రాలేదేం?' అని అడిగినా 'తీరిక లేక' అని చెప్పేసేది. మొదటి చూపులోనే భర్త అంతరంగాన్ని కాచివడపోసింది కావటం చేత -అతన్ని ఇబ్బందికి గురిచేసే ఏ పనీ చేసేది కాదు. మృత్యుంజయరావు పనిచేసిన ఆఫీసులో అధికారి పచ్చి లంచగొండి. దాన్ని వ్యతిరేకించే మృత్యుంజయరావు బతుకు దినదిన గండంగానే ఉండేది. అందుకే ఎప్పుడూ సెలవు కూడా పెట్టేవాడు కాదు. ఒకసారి పెళ్ళిరోజని సెలవు పెట్టాడు. దేనికీ ప్రాధాన్యతనివ్వని మృత్యుంజయరావు పెళ్ళిరోజుకి మాత్రం ఎంతో ప్రాధాన్యం ఇచ్చేవాడు. పెళ్ళిరోజని మృత్యుంజయరావు సెలవు పెడుతున్నట్లు ఆఫీసరుకి ఎవరో ఉప్పందించటంతో- ఆఫీసరు 'ఈరోజు పనుంది' 'మరో రోజు సెలవు పెట్టుకో' అన్నాడు. పుట్టిన రోజులూ, పెళ్ళిరోజులూ ఆ రోజుల్లోనే కానీ మరో రోజు జరుపుకోరన్నాడు మృత్యుంజయరావు. ఆఫీసరుతో మాటామాటా పెరిగింది.

"సెలవు ఎందుకివ్వరు" అన్నాడు.

"సెలవు హక్కు కాదు" ఆఫీసరన్నాడు.

"పెళ్ళిరోజులు, పుట్టినరోజులూ ఆఫీసు పనుల తరువాత" అన్నాడు మళ్ళీ.

"చూడండీ! వారమేసి రోజులు పెట్టిన వాళ్ళకి మీరు సెలవలిచ్చారు. చచ్చిపోయిన తల్లిదండ్రుల్ని, అత్తమామల్ని అవసరమొచ్చినప్పుడల్లా చంపుతున్న వాళ్ళకి సెలవలిస్తున్నారు. నేనొక్కరోజు పెడుతున్నానా."

"నేనివ్వనంటున్నాను."

"అదే ఎందుకివ్వరంటున్నాను."

"స్టుపిడ్... గెటౌట్."

"అయాం నాట్ స్టుపిడ్. ఎవరు స్టుపిడ్‌గా బిహేవ్ చేస్తున్నారో గమనించటం మంచిది" అని పెళ్ళి టెలిగ్రాం ద్వారా సి.ఎల్. పంపాడు. అప్పటికే మృత్యుంజయరావును ఎలాగైనా ఆఫీసునుండి కదపాలన్న ప్రయత్నంలో ఉన్న కొంత మంది అతనిమీద కుట్ర పన్ని మృత్యుంజయరావే ఆఫీసరుమీద చెయ్యి చేసుకున్నట్టు కథనం చేసి పై ఆఫీసరుకి పంపారు. మృత్యుంజయరావ్‌ని కొన్నాళ్ళు సస్పెండ్ చేసారు. ఆ తరువాత ఒకరిద్దరు గుమస్తాలు కలెక్టరెదుట మృత్యుంజయరావు తరఫున సాక్ష్యం ఇవ్వటంతో మృత్యుంజయరావుని మరోచోటుకి బదిలీ చేసారు.

భార్య ఆరోజు అన్నం పెడుతూ ముభావంగా కూర్చుంది. ఆరోజు కూరలో ఉప్పెక్కువయింది. "రమా! (ప'రమే'శ్వరిని రెండు మూడక్షరాలతో ముద్దుగా పిలుస్తాడు మృత్యుంజయరావు) నీ మనసు దేనికో కలత చెందుతోంది కదూ? నన్ను భర్తగా స్వీకరించి తొందరపడ్డాననుకుంటున్నావా?"అన్నాడు.

"అబ్బే... అదేం లేదండీ! ఎందుకలా అనుకుంటున్నారు?"

"నువ్వేదో ఆలోచనలో పడితేనే కూర పాడవుతుంది. ఇవాళ ఏదో ఆలోచనలో పడ్డావేమో అనిపిస్తోంది" అన్నాడు.

ఆమె ఆశ్చర్యపోయింది. ఇదే మాట భర్తనోట వినటం ఇది మూడోసారి. గతంలో రెండుసార్లు అన్యమనస్కంగా ఉన్నప్పుడే ఇలా జరిగింది.

"ఏమండీ, ఓ విషయం అడగనా?"

"అడుగూ!"

"మీరు దేనికీ ఇవ్వని ప్రాధాన్యత పెళ్ళిరోజుకెందికిస్తారసలు? ఆరోజు సెలవు పెట్టకపోతే ఇంత రాద్ధాంతం జరిగి ఉండేది కాదు కదా!"అంది.

"రమా! భర్తని భార్యా- భార్యని భర్తా అర్థంచేసుకోక- అడుగడుగునా అసంతృప్తుల వెల్లువలో మునిగి తేలుతూ- ఎందరో అర్థంలేని విధంగా కలిసి కాపురాలు చేస్తున్నారు. నిజానికి నువ్వేగాక- ఇంకెవరయినా నీ స్థానంలో ఉండి ఉంటే నా బతుకేమయేది? ఆఫీసు అవినీతి పుట్టగా ఉండి, అందరూ పైడబ్బులతో జల్సాలు చేస్తుంటే -వాళ్ళని చూస్తున్నావు. వాళ్ళ భార్యలు నిన్ను ఎద్దేవా చేస్తూ- నన్ను దెప్పిపొడుస్తున్నప్పుడు- వాళ్ళనో పురుగులా చూసి, తగిన సమాధానం ఇస్తున్నావు. అప్పుడు నేనెంత గర్వపడతానో తెలుసా? దానిక్కారణం- నువ్వు నా అర్థాంగివి కావటం,



"రమా! నేను తిరిగి ఎలా వస్తానో ఏమో? పిల్లలూ, నువ్వూ జాగర్త!"అని మృత్యుంజయరావు చెప్పినపుడు ఆమె దుఃఖానికి అంతులేకుండా పోయింది. "వెళ్ళొద్దండి. పోతే ఓ ఇంక్రిమెంట్ పోతుంది. పోనీండి" అంది. అతను వినలేదు.

మా అమ్మనాన్నలు కూడా నీలాటి కోడలు తమకి దొరికినందుకు వాళ్ళెంత ముచ్చట పడేవారో కదా? మా అక్కలు, చెల్లెలూ- నిన్ను చూసి, వాళ్ళ ప్రవర్తనలు చక్కదిద్దుకున్నారంటే- నీనుండి నాకెంత మంచి జరుగుతున్నదో కదా? నువ్వు నిజంగా 'అర్థాంగివి' అంటే నాలో సగానివే. నువ్వు లేనినాడు నేనో క్షణం బతకలేను. అందుకే నాకు 'పెళ్ళిరోజంటే' అంత ఇష్టం!"అని అతను ఉపన్యాసంలాటి సమాధానం చెప్పినపుడు ఆమె అంతరంగం నవనీతం అయింది. అతనిలో కరిగిపోయింది. అతనికి పూర్తిగా అంకితమైపోయింది.

ఆమె జీవితంలో అతని గురించి ఎన్నోసార్లు బాధపడింది. భయపడింది. అతని క్షేమంకోసం అతని నిర్ణయాల్లో మార్పును కోరుకుంది. కానీ అతని లక్ష్యానికి, ఆదర్శానికీ అడ్డుగా నిలిచి మాత్రం కాదు.

ఓసారి-

అతనంటే గిట్టనివాళ్ళు అతనికో పరీక్ష పెట్టారు. అదేమంటే అసెంబ్లీ ఎన్నికల్లో- అతి ప్రమాదకరమైన ఓ గ్రామానికి ప్రిసైడింగ్ ఆఫీసరుగా అపాయింట్ చేసారు. ఆ గ్రామానికెవరెళ్ళినా నామమాత్రంగానే వెళ్తారు. ఎన్నికల ముందు రోజే ఆఫీసర్లకు కావలసిన సకల సదుపాయాలూ కల్పిస్తారు. వాటినెవరూ తిరస్కరించరు. తిరస్కరించి కష్టాలెందుకు తెచ్చుకుంటారు?

మృత్యుంజయరావుని ఆ గ్రామానికి వేసారు.

వెళ్ళేముందు భార్యని దగ్గరకు తీసుకున్నాడు. "రమా! నేను తిరిగి ఎలా వస్తానో ఏమో? పిల్లలూ, నువ్వూ జాగర్త!"అని మృత్యుంజయరావు చెప్పినపుడు ఆమె దుఃఖానికి అంతులేకుండా పోయింది. "వెళ్ళొద్దండి. పోతే ఓ ఇంక్రిమెంట్ పోతుంది. పోనీండి" అంది. అతను వినలేదు. ఆమె ఆలోచించింది. అతనెళ్ళగానే ఆమె కలెక్టర్‌కీ ఎలక్షన్ కమిషనర్‌కి ఫిర్యాదుచేసింది. తన భర్త ప్రాణానికి ముప్పు తప్పించమని!

అనుకున్నట్లుగానే వాళ్ళు సకల సదుపాయాలూ చేసారు. మృత్యుంజయరావు తిరస్కరించాడు. అందరూ అతనికి నచ్చచెప్పారు. "మీనుండి మా ప్రాణాలకు ముప్పు రానీకండి. మమ్మల్ని మీ మొండితనానికి బలిచెయ్యకండి" అని వాళ్ళు మొరపెట్టుకుంటే- "నేం చెప్పినట్లు చెయ్యండి. భారం నామీద వేసుకుంటా"అన్నాడు. వాళ్ళకేం పాలుపోలేదు. పోలింగ్ ప్రారంభం అయిన అరగంటలోనే సన్నంగా, పొడుగ్గా గడకర్రలా ఉన్న వ్యక్తి వచ్చి, "మృత్యుంజయరావట. ఎవరిక్కడ?"అన్నాడు. ఆ మాటతోనే పోలింగ్ డ్యూటీలో ఉన్న నలుగురూ అదిరిపడ్డారు. మృత్యుంజయరావు పనిచేస్తూనే "ఏం? నేనే?" అన్నాడు.

ఇక్కడ పేరుకే రెండు పార్టీలోళ్ళు మనుషుల్ని నిలబెడతారు. ఇష్టమున్నోళ్ళు మా నాయుడిగోరికి ఓటేస్తే, అయినకు సూపి బాక్సులోనెయ్యాల. మిగిలిన ఓట్లు నువ్వు గుద్దేసి ఏత్తావో, మమ్మల్నే ఎయ్యమంతావో నీ ఇట్టం! ఇది మా నాయిడు సెప్పమన్నాడు' నేదా, నిన్నోసారి రమ్మన్నాడు. ఏటి సెప్తావ్?" అన్నాడు.

"ఇప్పుడు నాక్కలవటానికి కుదర్దు. ఇక మేం డ్యూటీకొచ్చింది రూల్సు ప్రకారం చెయ్యడానికేగానీ- మీరు చెప్పినట్లు చెయ్యడానిక్కాదు" అన్నాడు.

"ఇక్కడ సంగతి నీకెవులూ సెప్పనేదా? నీకు పెల్లాం పిల్లల్తో సుకం గుండాలన్నేదా?"

"బెదిరిస్తున్నావా?" అన్నంతలో-

"ఒరే, సూత్తారేటిర్రా. వొచ్చి ఆ బేలట్ పత్రాలు నాక్కొని ముద్రలు గుద్దండ్రా!" అరిచాడు.

"కానిస్టేబిల్సు! ఏం చేస్తున్నారక్కడ? వీళ్ళని అదుపులో పెట్టండి" అని బేలట్ పత్రాలు త్వరత్వరగా తీసుకుని, బేగ్‌లో పెట్టి జిప్ వేసాడు. వాళ్ళు కర్రల్తో లోపలికొచ్చారు. పోలీసుల బెదిరింపులకు వాళ్ళు లొంగలేదు.

ఇంతలో ఏం జరిగిందో 'అమ్మో!'అన్న పెద్ద అరుపు, మృత్యుంజయరావు కిరకిరా చుట్టుకున్నాడు. అయినా బేలట్ పత్రాలు వదల్లేదు. తక్కిన పోలింగ్ ఆఫీసర్లు ఆత్మరక్షణ వేటలో పరుగులు తీసారు. పోలీసులూ భయపడిపోయారు.

ఇది జరుగుతున్నంతలోనే సీఆర్పీ బెటాలియన్, ఎలక్షన్ ఆఫీసర్లూ దిగిపోయారు. వాళ్ళూ ఊళ్ళోకి రాగానే జరిగిన సంఘటన తెలిసిపోయింది. గాల్లో కాల్పులు, లాఠీ ఛార్జీలు, అరెస్టులు, విచారణ, మృత్యుంజయరావుని హాస్పిటలుకి తరలించటం. ఎన్నిక వాయిదా. ఏసిడ్ విసరటంవల్ల మృత్యుంజయరావు కుడి కన్ను కోల్పోవటం, మృత్యుంజయరావు ధైర్యాన్ని పేపర్లో మర్నాడు ప్రముఖ వార్తలుగా ముద్రించటం జరిగిపోయింది.

మృత్యుంజయరావుకి చావుతప్పినా, కన్ను పోయింది!

భార్య శోక దేవతయింది. "రమా! ఏడుస్తున్నావా?నువ్వు నా ధైర్యానివి. నీ ధైర్యంవల్లనే ఎవరూ సాధించలేనిది నేను సాధించాను. ఆ నాయుడు రెడ్‌హేండెడ్‌గా దొరికాడు ఏసిడ్ సీసాతో. వాడిక ఎన్నికల్లో పోటీ చెయ్యటానికే అనర్హుడు. అఫ్‌కోర్స్! వాడి పెళ్ళామో, ఉంపుడు కత్తో ఎన్నిక కావచ్చు. కానీ నేను సాధించాను. దానిక్కారణం నువ్వు. నా రెండు కళ్ళూ పోయినా, ఫరవాలేదు. నీ రెండు కళ్ళూ నాకు చాలు" అని ఆమెను దగ్గరకు తీసుకున్నప్పుడామె వెక్కి వెక్కి ఏడ్చేసింది.

అలాటి సంఘటనలు ఒకటా?...రెండా?... అసంఖ్యాకం!

వెరశి... అతనికి 'మొండి ఘటం!' 'సమర సింహం' 'ఉగ్ర నరసింహం' లాటి బిరుదులున్నా... పెద్దపెద్ద ఆఫీసర్ల దగ్గర మంచి పేరే ఉండేది.

ఒకేసారి అతని నిర్ణయాన్ని మార్చుకోమని కోరింది!

కోరినందుకు ఫలితం అనుభవించింది. పెద్ద దెబ్బే తగిలింది!

(మిగతా 12వ పేజీలో)

